# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 263
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జులై 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయాలి

- డాక్టర్ కడియం కావ్య
- పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ




# వడివడిగా.. అడుగులు

**మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణకు తుది విచారణ**

25వ తేదీ ఉదయం 11 గంటలు
గాడిపల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు

నోటీస్ జారీ చేసిన అదనపు కలెక్టర్

విలువైన సూచనలు అందించాలంటూ విజ్ఞప్తి

వివరాలు 2లో..

మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. అందులో భాగంగా విమానాశ్రయానికి ప్రస్తుతం ఉన్న భూమికి అదనంగా ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లి గ్రామంలో 175.38 ఎకరాలు, నక్కలపల్లి గ్రామంలో 44.14 ఎకరాలు మొత్తం 220 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకుగాను ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు గాడిపల్లిలోని వార్డు కార్యాలయంలో సామాజిక ఆర్థిక సర్వేపై తుది ప్రజా విచారణ నిర్వహించనున్నట్లు వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి జారీ చేసిన నోటీస్ లో పేర్కొన్నారు. యజమానులకు సరైన పరిహారం చెల్లించాలన్న లక్ష్యంతో చట్టంలోని సెక్షన్ 16(4), 16(5) కింద తుది గ్రామ సభగా నోటిపై చేసినట్లు ప్రకటించారు. న్యాయమైన పరిహారం అందించడంతోపాటు పునరావాసం కల్పించేందుకు భూములు, ఇండ్లు, ఇతర ఆస్తులు కోల్పోతున్న ఇంటి యజమానులు, ప్రజలు, భూ యజమానులు, ఆసక్తి కలిగిన వ్యక్తులు పాల్గొని తమ విలువైన సూచనలు అందజేయాలన్నారు. భూ సేకరణ పూర్తి కాగానే విమానాశ్రయం అభివృద్ధి పనులు పట్టాలెక్కనున్నట్లు సమాచారం.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

8లో..



## గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

- విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

8లో..



## పల్లెల్లో స్థానిక సందడి..

- రసవత్తరం కానున్న ఎన్నికలు
- ఆశావహుల పర్యటనలు, పలకరింపులు షురూ
- షెడ్యూల్ వచ్చేలోపు ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం




వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, జూలై 22, 2025



# వడివడిగా అడుగులు

- మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణకు తుది విచారణ
- 25వ తేదీ ఉదయం 11 గంటలు
- గాడిపల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు
- నోటీస్ జారీ చేసిన అదనపు కలెక్టర్
- విలువైన సూచనలు అందించాలంటూ విజ్ఞప్తి


**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ విమానాశ్రయం రాష్ట్రానికి గేమ్ చేంజర్ గా, రాష్ట్రాభివృద్ధికి కీలక మైలురాయిగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగడంతోపాటు పరిశ్రమల స్థాపనకు పెద్ద కంపెనీలు ముందుకొచ్చే అవకాశాలుంటాయి. అయితే నిజా పాలనలోనే 1930లో మామునూరు విమానాశ్రయం ఏర్పాటు చేశారు. వివిధ కారణాలతో 1980లో మూతపడింది. ఎయిర్ పోర్ట్ కోసం నిజాం కాలంలోనే 1,875 ఎకరాల భూమిని కేటాయించారు. విమానాల రాకపోకలు లేకపోవడంతో ఎయిర్ పోర్టుకు సంబంధించిన భూములను వివిధ అవసరాలకు వినియోగించారు. ఈ భూమిలోనుంచే వెటర్నరీ యూనివర్సిటీకి 675 ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్ కు 241.24 ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు, పోలీస్ శిక్షణ కేంద్రానికి 59 ఎకరాలు, నవోదయ విద్యాలయానికి 23.20 ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10 ఎకరాల భూమిని కేటాయించారు. దీంతో ఎయిర్ పోర్ట్ కు 696.14 ఎకరాల భూమి మాత్రమే మిగిలింది. అయితే ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు అదనంగా 253 ఎకరాల భూమి కావాల్సి ఉందని ఏయిర్ పోర్ట్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ఆ భూముల సేకరణకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది.

**భవిష్యత్ తరాలకు..**

మామునూరులో ఎయిర్ బస్–320 లాంటి పెద్ద విమానాలు తిరిగేలా విమానాశ్రయాన్ని నిర్మించతలపెట్టారు. దేశ, విదేశాల నుంచి సామగ్రి, ముడి పదార్థాలను తీసుకొచ్చే పెద్ద పెద్ద కార్గో విమానాలు కూడా ఇక్కడ దిగేందుకు వీలుగా రన్ వేలను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా ఇతర దేశాలనుంచి వచ్చే విమానాలు కూడా ఇక్కడ దిగేలా తీర్చి దిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్ లో అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్పు చేసినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన డిజైన్, వివిధ సాంకేతాక అంశాలు కొలిక్కి వచ్చాయి.

**తుది విచారణ..**

మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి ఖిలా వరంగల్ మండంలోని గాడిపల్లి గ్రామంలో 175.38 ఎకరాలు, నక్కలపల్లి గ్రామంలో 44.14 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ప్రతిపాధించింది. అయితే గతంలో నక్కలపల్లి గ్రామంలోని రైతులతో ప్రభుత్వం తరుపున జిల్లా కలెక్టర్ పలు దఫాలుగా చర్చలు జరపడంతో వారు తమ భూములను ఇచ్చేందుకు అంగీకరించారు.
అయితే గాడిపల్లిలో ఇండ్లు, ఇతర ఆస్తులను కోల్పోతున్న వారితో ప్రభుత్వం చర్చలు జరిపినా అవి ఫలించలేదు. దీంతో తుది ప్రజా విచారణను ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు గాడిపల్లిలోని వార్డు కార్యాలయంలో నిర్వహించేందుకు వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి నోటీస్ జారీ చేసింది. భూ సేకరణలో ఇండ్లు, ఇతర ఆస్తులు కోల్పోతున్న ఇంటి యజమానులు, ప్రజలు, భూ యజమానులు, ఆసక్తి కలిగిన వ్యక్తులు హాజరై తమ విలువైన సూచనలు తెలియజేయాలని కోరారు. తుది విచారణ ముగిసిన వెంటనే ఏయిర్ పోర్ట్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము
వరంగల్
తేది:10.07.2025.
No.G/2200/2021

నోటీస్

విషయం: పునరావాసం మరియు పునఃస్థాపన - వరంగల్ జిల్లాలోని మామ్నూర్ వద్ద విమానాశ్రయం అభివృద్ధి ప్రయోజనార్థం ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లి గ్రామంలోని నివాస గృహాలను సేకరించడం - ప్రాజెక్టు నిర్వాసితులకు R&R (పునరావాసం మరియు పునఃస్థాపన) లబ్ధిలను అందించడం - RFCTLARR చట్టం, 2013 అమలు - మామ్నూర్, వరంగల్ వద్ద విమానాశ్రయ ప్రాజెక్టు నిర్వాసితులకు R&R లబ్ధిలను అందించడానికి ముసాయిదా R&R పథకం తయారీ - సామాజిక ఆర్థిక సర్వే నిర్వహణ కొరకు 25.07.2025 న ఉదయం 11.00 గంటలకు జరిగే తుది ప్రజా విచారణకు హాజరు కావాలని వినతి - నోటీసు జారీ చేయుట - గురించి.

సూచన: 1) ప్రాథమిక నోటిఫికేషన్ నం. G1/2200/2021, తేది 01.12.2024
2) భూసేకరణ అధికారి & RDO, వరంగల్ లేఖ నం. B/1590/2024 తేది.04.04.2025
3) ఈ కార్యాలయ వార్డ్ సభ నోటీస్ తేది: 19.04.2025

&&&&

వరంగల్ జిల్లాలోని మామ్నూర్ వద్ద విమానాశ్రయం అభివృద్ధి ప్రయోజనార్థం ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లి గ్రామంలో 175.38 ఎకరాలు, నక్కలపల్లి గ్రామంలో 44.1450 ఎకరాలు, మొత్తం 220-12½ ఎకరాల భూమిని సేకరించాలని ప్రతిపాదించబడినది. ఈ మేరకు న్యాయమైన పరిహారం మరియు భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో పారదర్శకత హక్కు చట్టం, 2013 (కేంద్ర చట్టం నెం.30 ఆఫ్ 2013) లోని సెక్షన్ 11(1) లోని నిబంధనల ప్రకారం, మరియు న్యాయమైన పరిహారం మరియు భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో పారదర్శకత హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నెం.21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన ప్రకారం, ఫారం-VI లో ప్రాథమిక నోటిఫికేషన్ సాక్షి తెలుగు దినపత్రికలో మరియు హన్స్ ఇండియా ఇంగ్లీష్ దినపత్రికలో 05.12.2024న ప్రచురించబడింది. ఈ నోటీసు న్యాయమైన పరిహారం మరియు భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో పారదర్శకత హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) ప్రకారం జారీ చేయబడింది. ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లి గ్రామానికి చెందిన భూమిని/ఇండ్లు కోల్పోయిన యజమానులకు సరైన పరిహారం చెల్లించడానికి ఈ చట్టంలోని సెక్షన్ 16(4) & 16(5) కింద తుది గ్రామ సభ నోటీసు జారీ చేయబడింది.

అందుకనుగుణంగా, 25.07.2025 న ఉదయం 11.00 గంటలకు గాడిపల్లి లోని వార్డు కార్యాలయంలో సామాజిక ఆర్థిక సర్వేపై తుది ప్రజా విచారణ నిర్వహించబడుతుంది. కావున భూసేకరణలో ఇండ్లు/ఇతర ఆస్తులు కోల్పోతున్న ఇంటి యజమానులు /ప్రజలు/భూ యజమానులు/ఆసక్తి గల వ్యక్తులు హాజరై తమ విలువైన సూచనలు అందజేయగలరు.
జతచేసినది: (కుటుంబముల సోషియో ఎకనామిక్ అసెస్మెంట్ సర్వే జాబితా).

సం/- జి. సంధ్యా రాణి.
అదనపు కలెక్టర్(రెవెన్యూ)&
ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్
వరంగల్.

//ధ్రువీకరణ//
విభాగము పర్యవేక్షకులు
(తహసిల్దార్ కాడర్)

పిరణ:
1. గాడిపల్లి వార్డ్ కార్యాలయం నోటీస్ బోర్డుకు కాపీ.
(తహసీల్దార్, ఖిలా వరంగల్, గాడిపల్లి వార్డ్ కార్యాలయం నోటీస్ బోర్డుపై నోటీసును అంటించి, వార్డ్ లో టామ్-టామ్ చేయవలసినదిగా మరియు నివేదికను సమర్పించవలసినదిగా కోరడమైనది.)
2. శ్రీయుత కమిషనర్, GWMC, వరంగల్ గారికి తగు సమాచారం నిమిత్తం ఇవ్వనైనది.
3. శ్రీయుత డిప్యూటీ కమిషనర్, కాశిబుగ్గ, GWMC, వరంగల్ కు వార్డ్ సభ నిర్వహణ కోసం సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇవ్వాలని కోరడమైనది.
3. గాడిపల్లి వార్డ్ కార్యాలయానికి కాపీ, వార్డ్ సభ నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయవలసినదిగా కోరడమైనది.
4. శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు ఆర్ & ఆర్ అధికారి, వరంగల్ గార్కి.
5. ఆర్ & ఆర్ కమిటీ సభ్యులు తుది ప్రజా విచారణకు హాజరు కావలసినదిగా కోరడమైనది.
(తహసీల్దార్, ఖిలా వరంగల్ గారి ద్వారా)
6. శ్రీయుత DPRO, వరంగల్ గారికి స్థానిక మీడియాకు సమాచార నిమిత్తం ఇవ్వనైనది.
7. శ్రీయుత తహసీల్దార్, ఖిలా వరంగల్ గారికి ఆర్ & ఆర్ కమిటీ సభ్యులకు నోటీస్ తామీలు చేసి తామీలు ప్రతి సమర్పించుటకై ఇవ్వనైనది.
8. కలెక్టర్ కార్యాలయం, వరంగల్ నోటీస్ బోర్డుకు కాపీ.
9. క్యాంప్ క్లర్క్, కలెక్టర్/అదనపు కలెక్టర్, వరంగల్ కు సమాచార నిమిత్తం ఇవ్వనైనది.

# పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయాలి

- డాక్టర్ కడియం కావ్య
- పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సంబంధించిన పురోగతిని కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్సభలో వెల్లడించింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ మంత్రి జితిన్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా ఈ కారిడార్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం ద్వారా వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేస్తూ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల స్థితిగతులు, అమలులో ఉన్న కార్యాచరణ ప్రణాళికలను వాటి పురోగతిపై త్వరలో మరింత సమాచారం వెల్లడిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి దేశవ్యాప్తంగా పారిశ్రామిక కనెక్టివిటీని మెరుగుపరచడంలో భాగంగా, భారత ప్రభుత్వ సమగ్ర ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా సాగుతోందని మంత్రి వివరించారు. పారిశ్రామిక కారిడార్ల పురోగతిపై కేంద్రం నిరంతరం రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని కొనసాగిస్తోందని తెలియజేశారు. ఈ ప్రకటనపై స్పందించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కోసం కేంద్రం సహకారం కొనసాగాలని ఆశించారు. పారిశ్రామిక కారిడార్ల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.



# సరిపడా యూరియా ఉంది

- రైతులు ఆందోళన చెంద వద్దు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** జిల్లాలో సాగుచేస్తున్న పంటలకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘ సొసైటీని కలెక్టర్ తనిఖీ చేసి యూరియా నిల్వలు, అమ్మకాలు, ధరలు, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,71,595 ఎకరాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేశారన్నారు. ఎకరానికి ఒక బస్తా (45 కిలోలు) యూరియా వేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లా రైతులకు కావాల్సిన యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ముందస్తుగా యూరియాను కొనుగోలు చేసి పంటపొలాలలో నిల్వ చేసుకుంటున్నారని, దానికోసం అందరు రైతులు ఒకేసారి రావడంతో కొంత ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. జిల్లా రైతులకు సరిపడా యూరియా ఆయా కేంద్రాలకు విడుతల వారీగా అందజేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ నెల రైతులకు అవసరమున్నా యూరియా హకా, మార్క్ ఫేడ్ ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ డీలర్ల వద్ద సైతం యూరియా ఉందని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాకు 16,865 మెట్రిక్ టన్నులు యూరియా రాగా, 11,171 మెట్రిక్ టన్నులు రైతులకు అందిచామని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి యూరియా తెప్పిస్తామని తెలిపారు. యూరియాను బ్లాక్ చేసినా, అధిక ధరలకు అమ్మినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామరి హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఏఓ అనురాధ, డీసీఓ నీరజ, ఆర్డీఓ ఉమారాణి, ఏవో రజిత తదితరులు ఉన్నారు.



# ఐసీసీసీ క్షేత్ర స్థాయి సందర్శన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ని మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. నిర్వహణ తీరును అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ మహేందర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈఈలు రవికుమార్, మాధవీలత, డీఈలు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, జూలై 22, 2025

# ప్రతి కాలనీని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తాం

## ▪ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యేగా తన దృష్టికి వచ్చిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం, సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మంగళవారం నాడు 57వ డివిజన్‌లోని అశోక కాలనీలో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అశోక కాలనీలో పర్యటన ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే నాయిని, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను అభినందించారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్తు, నీటి సౌకర్యం, చెత్త సేకరణ నిర్వహణ వంటి అంశాలపై ఆయన కాలనీ వాసులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, స్థానికంగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ కాలనీలో నిర్మించ తలపెట్టిన ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించినందున, ప్రతి కాలనీని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అందరూ బాసటగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్ యాదవ్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.





## గత పాలకుల నిర్లక్ష్యంతో కుంటుపడిన అభివృద్ధి..

**వరంగల్ వాయిస్, కాజీపేట:** గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాజీపేట అభివృద్ధి కుంటుపడిందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున సోమిడి జంక్షన్‌లో రూ.2 కోట్ల నిధులతో కాజీపేట నుంచి సోమిడి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాజీపేటకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసిన తాము, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. రెండు డివిజన్ల నడుమ ఉండే ప్రధాన రహదారి కావడంతో ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో కాజీపేట నుంచి సోమిడి వరకు రోడ్డు పనులను చేపట్టామని అన్నారు. గతంలో కొంత మేరకు జరిగిన పనులను ఇప్పుడు పూర్తి స్థాయిలో చేపడుతున్నామని తెలిపారు. నగర అభివృద్ధిలో కార్పొరేషన్, కుడా సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. సోమిడి జంక్షన్ అభివృద్ధికి రానున్న రోజుల్లో నిధులు కేటాయించి సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ, రజాలి, మాజీ కార్పొరేటర్ అశోక్, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులు, సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాల దత్తత గ్రామంగా పులుకుర్తి

**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని పులుకుర్తి గ్రామాన్ని వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విలేజ్ అడాప్షన్ ప్రోగ్రామ్ కింద దత్తత గ్రామంగా ఎంపిక చేసుకున్నట్లు సహాయ ఆచార్యులు డాక్టర్ కోటా శివకృష్ణ తెలిపారు. మంగళవారం పులుకుర్తి రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి నిర్వహించి, గ్రామానికి సంబంధించిన పంటల వివరాలు, సాగు భూమి విస్తీర్ణం, ఇతర పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివకృష్ణ మాట్లాడుతూ, దత్తత గ్రామంలో మూడు సంవత్సరాల పాటు వ్యవసాయ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికోసం ప్రణాళికలు తయారు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తూ, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక సాగు పద్ధతులను రైతులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ




కార్యక్రమంలో డాక్టర్ బి.రాజు, డాక్టర్ ఈ. రాంబాబు, జి.నరేందర్, ఏఈఓ రామకృష్ణ, రైతులు కాసెట్టి లక్ష్మణ్, పేరుక సత్యం, గోపు రమేష్, గన్ను వెంకటేశ్వర్లు, అంకేశ్వరపు రాంబాబు, రాజు తదితర రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శారదా దేవి, వివేకానందుల జీవితాలు ఆదర్శం

## ● స్వామి తత్వదానంద మహారాజ్

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** శ్రీ రామకృష్ణ సేవా సమితి పర్వతగిరి, స్వయంసేవిక బృందం కల్లెడ ఆధ్వర్యంలో సోమవారం ఆర్.డీ.ఎఫ్ వనిత అచ్యుత పాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం నుంచి స్వామి తత్వదానంద మహారాజ్, సూర్య ప్రకాష్ విచ్చేశారు. విద్యార్థులను ఉద్దేశించి స్వామి తత్వదానంద మహారాజ్ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. శారదా మాత గొప్పతనాన్ని విద్యార్థులందరికీ అర్థమయ్యేలా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మహారాజ్ వివేకానందుని శక్తి , మార్గదర్శి అనే అంశంపై చేసిన ప్రసంగం విద్యార్థులందరినీ ఆకట్టుకొని అనుసరించే విధంగా సాగింది. విద్యార్థులలో దాగివున్న ప్రతిభను గుర్తించి వారిని ప్రశంసించారు. ప్రధాన వక్త మాట్లాడుతూ వివేకానందుని సాహిత్యం చదివి ప్రతి ఒక్కరూ అనుసరించి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత సోషల్ మీడియా సమాజంలో, శ్రీ శారదా దేవి, స్వామి వివేకానందల జీవితాలని ఆదర్శంగా తీసుకొని వారి స్ఫూర్తిదాయకమైన సాహిత్యాన్ని ప్రతిరోజు కొంత సమయం వెచ్చించి చదవడం వలన వ్యక్తిత్వంలో ఎంతో మార్పు కలిగి, సౌశీల్యంతో సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పొందుతారని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో లక్షలాది



మందికి నైతిక అంశాలలో శిక్షణ ఇస్తున్న హైదరాబాద్ రామకృష్ణ మఠంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ (వివేకానంద మానవ ప్రతిభా కేంద్రం) నిర్వహిస్తున్న వివిధ శిక్షణ తరగతులను ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చని సూచించారు. రామకృష్ణ సేవా సమితిలకు ఈ ఆన్‌లైన్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహించబడతాయని, గ్రామీణ విద్యార్థులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశానికి ఆర్.డీ.ఎఫ్ కళాశాల ప్రిన్సిపల్ ఆడెపు జనార్ధన్ అధ్యక్షత వహించారు. కల్లెడ రూరల్ స్కూల్ హెడ్‌మాస్టర్ కే. శ్రీనివాస్, రామకృష్ణ సేవా సమితి పర్వతగిరి జాయింట్ సెక్రెటరీ వడ్లకొండ దయాకర్, వైస్ ప్రిన్సిపల్ ఏ. రాజు, అకాడమిక్ హెడ్ ప్రవీణ్ కుమార్, ఏ.వో. సతీష్, ఉపాధ్యాయులు శ్రీధర్, మహేష్, జయశంకర్, ధనజయ, సైదులు, శ్రీలత, ధనలక్ష్మి, సంతోష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి సారించాలి

## హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. మంగళవారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.ఆర్. బాలికల జూనియర్ కళాశాలలో ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మచ్చ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలు, బ్యాంక్ ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో వచ్చే నకిలీ ఏపీకే ఫైల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎల్లప్పుడూ తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని, చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని వారికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఏఎస్ఐ లక్ష్మి, సిబ్బంది రమ్య, బ్లూ కోల్ట్స్ కుమార్, హరిప్రసాద్, సైబర్ వారియర్ కిరణ్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 20,000 విలువ చేసే పరీక్షా పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల 1993 ఎస్సెస్సీ టాపర్ నాళ్ల వివేక్ తండ్రి, బీఎస్ఎన్ఎల్ నుంచి పదవీ విరమణ పొంది సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న నాళ్ల సోమనాథం ఈ పుస్తకాలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏవీవీ విద్యాసంస్థల శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్ మాట్లాడుతూ నాళ్ల సోమనాథం దాతృత్వాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాత నాళ్ల సోమనాథం మాట్లాడుతూ తన కుమారుడు ఈ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. అందుకే గత ఆరు సంవత్సరాలుగా ఈ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితురాలికి అందజేత




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** 2023 సంవత్సరంలో వరంగల్ పోచమ్మ మైదానానికి చెందిన స్వాతి తన సెల్‌ఫోన్‌ను ఆటోలో మర్చిపోయారు. వెంటనే ఆమె పోలీస్ స్టేషన్, సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ పోలీస్ సిబ్బంది అశోక్ పోగొట్టుకున్న ఆ ఫోన్‌ను గుర్తించారు. మంగళవారం హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ చేతుల మీదుగా ఆ ఫోన్‌ను బాధితురాలు స్వాతికి అప్పగించారు. ఈ సందర్భంగా బాధితురాలు

# విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

## ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర నేత గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, వరంగల్:** విద్యారంగ సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా, కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, సంక్షేమ హాస్టళ్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో చాలావరకు హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందని, వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. 23న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని తల్లిదండ్రులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజలను గడ్డం నాగార్జున విజ్ఞప్తి చేశారు.

# కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంఎల్టి కోర్సులో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా తెలిపారు.10వ తరగతి లో పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అప్లై చేసుకునే విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో తేదీ 23-07-2025 బుధవారం నేరుగా పర్వతగిరి కస్తూరిబా గాంధీ పాఠశాలకు రావలసిందిగా తెలిపారు.

# తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందాం




◆ బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గోదావరి నదిలో తెలంగాణ నీటి వాటాను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. మంగళవారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో బనకచర్ల ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా తెలంగాణ ఉద్యమం జరిగిందని, రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పచ్చని మణిహారంగా తయారైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి నది నుంచి 200 టీఎంసీలను అక్రమంగా తరలించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంత పెద్ద కుట్ర జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తిప్పికొట్టకుండా వారికి సహకరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ విద్యార్థి లోకం ఏకమై గోదావరి నది నుండి బనకచర్ల ప్రాజెక్ట్ పేరుతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దోపిడీ చేసే 200 టీఎంసీల నీళ్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గోదావరి, కృష్ణా నదుల యాజమాన్య బోర్డులు, కేంద్ర జల సంఘం అనుమతులు లేకుండా, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చలు జరగకుండా ప్రాజెక్ట్ నిర్మించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవేవీ లెక్కచేయకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారని ప్రశాంత్ తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ విద్యార్థి సమాజం మేల్కొని బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించొద్దని కేంద్రానికి లేఖ రాసిన చంద్రబాబు, బనకచర్ల పేరుతో తెలంగాణ ప్రాంత నీటిని ఆంధ్రకు తరలించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందించకపోవడం సిగ్గుచేటు అని ప్రశాంత్ ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణ నీటి వాటాను తరలిస్తే తెలంగాణ ప్రాంతమంతా ప్రమాదంలో పడే అవకాశం ఉందని, సాగునీరు, తాగునీరు ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య జరిగిన ఒప్పందాన్ని బయటపెట్టాలని, రైతన్నకు నష్టం చేస్తే ఇక్కడ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. బనకచర్ల ఆపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్లు అరూరి రంజిత్, గంధ్ర కోట రాకేష్ యాదవ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరస్వామి, రాసురి రాజేష్, మహీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భూమిని కాపాడిన బీజేపీ నేతలు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని మైలారం గ్రామంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ మైలారం పాత గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలమవడంతో కొత్త భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే, 2025 జూలై 13న పాత గ్రామ పంచాయతీ (కచ్చేరి) స్థలంలో కొందరు వ్యక్తులు, ఇది ‘ వక్ఫ్ భూమి’ అని చెబుతూ, ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రభుత్వ సెలవు రోజున, అధికారులు లేని సమయంలో వచ్చి కొత్త నిర్మాణం కోసం ముగ్గు వేసే కార్యక్రమం చేపట్టారని వివరించారు. దీనిని గ్రామ ప్రజలు అడ్డుకొని, భూతం తిరుపతితో కలిసి బీజేవైఎం రాష్ట్ర నాయకులు తాటికొండ రవికిరణ్‌కు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన రవికిరణ్, 2025 జూలై 14న కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని మొగిలి తెలిపారు. కలెక్టర్ తక్షణమే స్పందించి, ఈ విషయంపై విచారణకు డీపీఓకు ఆదేశించగా, డీపీఓ శాయంపేట మండల ఎంపీఓను మైలారం గ్రామానికి వెళ్లి విచారణ చేసి నివేదిక పంపాల్సిందిగా కోరారు. ఎంపీఓ తన అధికారులతో, గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలోకి వచ్చి ప్రజలను అడుగగా, అది ప్రభుత్వ భూమి అని, ఇంతకు ముందు అక్కడ గ్రామ పంచాయతీ ఉండేదని, అది కూలిపోవడం జరిగిందని నిర్ధారించుకున్నారు. అంతేకాకుండా, జాతీయ జెండా ఎగురవేయడం కోసం నిర్మించిన జెండా గద్దె కూడా అక్కడ ఉందని, కాలక్రమేణా భూమి లోపలికి వెళ్లడంతో తవ్వి చూపించారని అన్నారు. బీఎస్ఎన్ఎల్ వారు నిర్మించిన సెల్ టవర్‌ను కూడా ప్రజలు అధికారులకు చూపించడంతో, అది గ్రామ పంచాయతీ భూమినే అని అధికారులు నిర్ధారించుకున్నారని తెలిపారు. స్థానిక రెవెన్యూ వారిని కూడా విచారించి, ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణం చేయకూడదని వారికి చెప్పి, పై అధికారులకు నివేదిక పంపడం జరిగిందని మొగిలి వివరించారు. అనంతరం బీజేపీ నాయకులు గ్రామ ప్రజలతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రవికిరణ్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ తీసుకువచ్చిన నూతన వక్ఫ్ చట్టమే ఈ రోజు మైలారం గ్రామ పంచాయతీ భూమిని కాపాడిందని అన్నారు. భారతీయ జనతా పార్టీ చేసే ప్రతి పని ప్రజా సంక్షేమం కోసమేనని, ఎప్పుడూ ప్రజల పక్షమే ఉంటుందని, ప్రజా సమస్యలే పరమావధిగా పనిచేస్తుందని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు. జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, బూత్ అధ్యక్షులు కన్నబోయిన రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

◆ ఆత్మకూరు సీఐ ఆర్ సంతోష్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** యువత చెడు వ్యసనాలైన మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని ఆత్మకూరు సీఐ ఆర్ సంతోష్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాగృతి పోలీస్ కళాబృందంచే యువత పెడదారి పడుతున్న వ్యసనాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ సంతోష్ మాట్లాడుతూ యువత విద్యార్థులు గంజాయి డ్రగ్స్, గుట్కా ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్స్ వంటి వాటి బారిన పడవద్దన్నారు. ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువైనాయన్నారు. వాటి బారిన పడకుండా చదువుపై శ్రద్ధ నుంచి ఉన్నత లక్ష్యంతో ప్రణాళిక బద్ధంగా చదువులను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే 100 డయల్ సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్ లైన్ నెంబర్ కి ఫోన్లు చేసి రక్షణ పొందాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఈవ్ టీజింగ్, షీ టీమ్స్ గురించి విద్యార్థులకు పోలీస్ కళాబృందం ఆటపాటలతో అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థుల చేత డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాల కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.కవిత, ఇంచార్జి రమాదేవి, జాగృతి పోలీస్ కళాబృందం ఇంచార్జి ఏఎస్ఐ నాగమణి, బృందం సభ్యులు విలియం వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్ సింగ్, శ్రీనివాస్, విక్రమ్, రాజు, చిరంజీవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ మీటింగ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 9న జరిగిన సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులకు, ఉద్యోగులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవల మరణించిన వారికి సంతాపంగా రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 ఇస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి 19 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయలేదని, వెంటనే ఈ హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి వేల్పుల సారంగపాణి అధ్యక్షత వహించగా సీపీఐ పార్టీ కార్యాలయం నుంచి మద్దెల ఎల్లేష్, తోట భిక్షపతి, జిల్లా ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, సహాయ కార్యదర్శులు బత్తిని సదానందం గౌడ్, గుంటి రాజేందర్, లంక దాసరి అశోక్, దుర్గా ప్రసాద్, మాలోత్ శంకర్, అశోక్, రాసమల్ల కుమార్, ఓదేలు పాల్గొన్నారు.

# నడికూడ అభివృద్ధికి చల్లా కృషి ఎనలేనిది

**◆ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు**



**వరంగల్ వాయిస్, నడికూడ:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రజల సౌలభ్యం కోసం 33 జిల్లాలను ఏర్పాటు చేశారని, అందులో భాగంగా నడికూడ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేశారని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు అన్నారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో నడికూడ మండలం ఏర్పాటు జరిగిందని, ఇందులో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయని ఆయన తెలిపారు. గత 50 సంవత్సరాలుగా గొల్లపల్లి రోడ్డు వద్ద డౌన్ బ్రిడ్జి లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సౌలభ్యం కోసం రోడ్డు నిర్మాణం, మండలానికి రాకపోకల కోసం పులిగిల్ల నుంచి ధర్మారం వరకు పీఎంజీఎస్వై నిధుల నుంచి రూ.4.90 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని రవీందర్ రావు వివరించారు. అప్పటి ఎమ్మెల్యే



చల్లా ధర్మారెడ్డి పట్టుదలతో గొల్లపల్లి రోడ్డు డౌన్ బ్రిడ్జికి పీఎంజీఎస్వై నిధుల నుంచి రూ.2.30 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. అప్పటి పంచాయతీరాజ్ అధికారులు పీఆర్ఈఈ శంకరయ్య, డీఈ లింగారెడ్డి, ఏఈ రాజేష్ ఎస్టిమేట్‌తో ప్రతిపాదనలు పంపగా, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పట్టుదలతో బ్రిడ్జిని మంజూరు చేయించారని అన్నారు. అప్పటి ప్రభుత్వంలో టెండర్లు పూర్తి చేసి, శంకుస్థాపన సమయంలో ఎన్నికల కోడ్ రావడం వల్ల అది ఆగిపోయిందని పేర్కొన్నారు. నడికూడ గ్రామ ప్రజలు గొల్లపల్లి రోడ్డు బ్రిడ్జి విషయంలో ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో నూతన మండలం ఏర్పాటు, మండలానికి సంబంధించిన ఎమ్మార్వో ఆఫీసు, ఎంపీడీఓ ఆఫీసు, పోలీస్ స్టేషన్, హెల్త్ సెంటర్, నాలుగు లైన్ల రోడ్లు, 14 గ్రామ పంచాయతీలకు రాకపోకల సౌలభ్యం కోసం రోడ్డు వైండింగ్‌లో భాగంగా డబుల్ రోడ్డు నిర్మాణం జరిగిందని తెలిపారు. పట్టణాలకు దీటుగా సెంట్రల్ లైటింగ్ కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి గొల్లపల్లి బ్రిడ్జి విషయంలో ఎదురైన ఇబ్బందులు తొలగిపోయి, గ్రామ ప్రజలు, రాకపోకలు సాగించే ప్రజల చిరకాల కష్టాలు నెరవేరినందుకు గత మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని నడికూడ తాజా మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, పాలకవర్గం, నడికూడ బీఆర్ఎస్ గ్రామ కమిటీ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండల కేంద్రంలో ఇటీవల పద్మశాలీ చేనేత కుటుంబానికి చెందిన శ్రీరామ్ భూమయ్య మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి-రవీందర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే శ్రీరామ్ భూమయ్య చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

## జిల్లా స్థాయి పోటీలకు మహేశ్వరం విద్యార్థిని



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి పద్య పఠన పోటీలకు నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలో గల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఇజ్జగిరి లేఖన ఎంపికైంది. నర్సంపేట మండలంలో మొత్తం 54 మంది విద్యార్థులు పాల్గొనగా, కేవలం నలుగురు మాత్రమే జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అందులో మహేశ్వరం పాఠశాల విద్యార్థిని లేఖన ఉండటం విశేషం. లేఖన ఎంపికైన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు స్వరూప, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేవాలయ పునఃనిర్మాణ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** స్థానిక పాటి మీద పునఃనిర్మించిన సపరివార పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి శివాలయ నూతన శిఖర ప్రతిష్టాపూర్వక సుబ్రహ్మణ్యేశ్వర ప్రతిష్టా మహోత్సవంకు హాజరు కావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆహ్వానించారు. ఆలయ పునర్నిర్మాణ దాత పత్తి సమ్మయ్య, కమిటీ సభ్యులు కలిసి ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, తొర్రూరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, తొర్రూరు పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, నాయకులు ధరావత్ జై సింగ్, తూర్పాటి రవి, పేర్ల జంపా, తూర్పాటి నాగరాజు, బేడ బుడగ జంగాల కుల పెద్దలు కిన్నెర గురువయ్య, పత్తి లక్ష్మణ్, సిరిగిరి రాంబాబు, పేర్ల సంతోష్, పస్తం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో నలుగురికి జైలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, అడిషనల్ డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49 మందిని మంగళవారం మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరిచారు. పట్టుబడిన వారిలో మూరె సతీష్, వల్లెపు సంజీవ్, రమేష్, మెరుగు మురళిలకు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 45 మంది వ్యక్తులకు రూ.50,800 జరిమానా విధించారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా, వారికి రూ.2500/- రూపాయల జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ మద్దతు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మద్దతు ఇస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి. తిరుపతి తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నా కనీసం స్పందించలేని స్థితిలో ప్రభుత్వ అధికారులు ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ పోస్టుల భర్తీ విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని, ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేయడంలో విద్యాశాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని తిరుపతి అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం



లేదని డీవైఎఫ్ఐ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థుల ఫీజులు విడుదల చేయడం లేదని, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామంటూనే, విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీలను విపరీతంగా పెంచి భారం మోపిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించలేని పాలనగా మారిందని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి జరుగుతున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తిరుపతి స్పష్టం చేశారు.

## ఘనంగా ఏఎంసీ చైర్ పర్సన్ స్వప్న సదానందం జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోని ఆమె నివాసంలో ఘనంగా జరిగాయి. మడిపల్లి గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ల్యాదల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో పుల్లూరి స్వప్న-సదానందం దంపతులచే కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి, ఫొటోను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండలం ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

**వరంగల్ వాయిస్, చిట్యాల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కనకం తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో, బీఆర్ఎస్ పార్టీ చిట్యాల మండలాధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు జమ చేసిన రూ.26 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అల్లం రవీందర్ మాట్లాడుతూ కనకం తిరుపతి ఒకే పార్టీలో దీర్ఘకాలికంగా పనిచేసిన నమ్మకమైన కార్యకర్త అని, బీఆర్ఎస్ పార్టీ సైనికుడిగా పని చేశారని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం నాయకులంతా కలిసి మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్ గౌడ్, పార్టీ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు తౌటం నవీన్, సీనియర్ నాయకులు భైరం భద్రయ్య, పాండ్రాల వీరస్వామి పాల్గొన్నారు.



# పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, బల్దియా:** పన్ను వసూళ్లలో నిర్లక్ష్యాన్ని వీడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పన్ను వసూళ్ల పురోగతిపై రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని, సమర్థవంతంగా వసూళ్లు చేపట్టేందుకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ఐల వారీగా పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షించి మాట్లాడారు. అనుకున్న స్థాయిలో పన్ను వసూళ్లు జరగడం లేదని, గత సమావేశంతో పోల్చితే పన్ను వసూళ్లలో పురోగతి కనిపించడం లేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ఓలు షహజాది బేగం, యూసుఫోద్దీన్, శ్రీనివాస్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



# మీర్జా ఇలియాస్ బేగ్‌కు సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నీటిపారుదల శాఖ, ఐ అండ్ సీఏడీ, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్ సర్కిల్, కేసీ కాలనీ, హనుమకొండ సూపరింటెండెంట్‌గా మీర్జా ఇలియాస్ బేగ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ 3194 ఉపాధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్, టీజీపీఓఏ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్ జయ కిషోర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మంచిగా ప్రమోద్ కుమార్ గౌడ్, మైనారిటీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు జహీర్ అహ్మద్ బేగ్, ప్రధాన కార్యదర్శి వలీ పాషా, జిల్లా ఐఎన్‌టీయూసీ నాయకులు చిట్యాల భద్రయ్య, కోడెం వేణుగోపాల్, మంజుల, మురా వని, కిషోర్ కుమార్, అరూన్ అహ్మద్, హరీష్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు
- మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు:** రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించాలన్న ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, రేషన్ కార్డులు పేద కుటుంబాలకు ఎంతో కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి పథంలో భాగంగా ఎస్ఎస్ తాడ్వాయి, ఏటూర్ నాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండల కేంద్రాల్లో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలిసి మంత్రి సీతక్క నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తాడ్వాయి మండలంలో 600 నూతన రేషన్ కార్డులను అందించడమే కాకుండా, మరో 1100 కార్డులను మార్పిడి చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచామని తెలిపారు. 2013 సంవత్సరంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రతి ఒక్కరికీ కడుపునిండా తిండి పెట్టాలనే ఉద్దేశంతో ఆహార భద్రత చట్టం తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల నిరుపేదలు కడుపునిండా తినలేకపోవడాన్ని గ్రహించి, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారని అన్నారు. మన రాష్ట్రంలో పండించిన సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడమే కాకుండా, ఇక్కడ పండించిన సన్నబియ్యాన్ని ధనవంతుడు తింటున్న విధంగానే పేదలు తినాలన్న ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను మహిళల పేరు మీదుగానే అందిస్తున్నామని, వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. గతంలో ప్రైవేటు రంగాలలో రుణాలు పొందిన మహిళలు వడ్డీలపై వడ్డీలు కట్టి ఆర్థికంగా నష్టపోయారని, అలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు రుణాలు ఇవ్వడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇప్పటికే ఆర్టీసీ బస్సులను అందజేయడంతో పాటు, లోన్ బీమా పథకం, ప్రమాద బీమా పథకం ఏర్పాట్లు, కొత్త సంఘాల ప్రారంభం, స్త్రీ నిధి రుణాలు అందజేయడం, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పాడి గేదెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్, సంచార చేపల విక్రయ కేంద్రం, వ్యవసాయ అనుబంధ జీవనోపాధి కల్పన కోసం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు తదితర కార్యక్రమాలను మహిళా సంఘాల చే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వంటి వివిధ వ్యాపారాలు చేయడం వల్ల నెలకు మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు.





బ్యాంకులు నేడు మహిళా సంఘాలకు క్యూ కట్టి రుణాలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు అందిస్తున్నామని, మహిళా సభ్యులు సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షల వరకు లోన్ బీమా అమలు అవుతుందని అన్నారు. 60 సంవత్సరాలు నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. మహిళా సంఘాలు సామాజిక భరోసాగా పని చేయాలని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్నబియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఎదగడానికి దోహదపడుతుందని, ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేనీ, డీఎండీసీఎస్ఓ రాంపతి, డీసీఓ సర్దార్ సింగ్, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# పేదల సమస్యలు పరిష్కరించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రజా పాలనలో పేదలకు నిలువ నీడ, ఇంటి స్థలాలు, పట్టాలు, కనీస సదుపాయాలు కల్పించరా అని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ప్రశ్నించారు. పేదలకు ఎన్నికల హామీలను వర్తింపజేసి అమలు చేయకపోతే ఉధృతంగా ప్రజా పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. మంగళవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) – ఎంసీపీఐ (యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది పేదలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏకశిల పార్కు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు, ఆటపాటలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గాదగోని రవి మాట్లాడుతూ అట్టడుగు వర్గాన ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కేవలం కొద్ది మంది ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సాకుగా చూపించి ఇచ్చిన హామీలను విస్మరిస్తూ పబ్బం గడుపుకుంటున్నదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తక్షణమే పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, ఇంటి నంబర్లు, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాలోతు సాగర్, ముక్కెర రామస్వామి, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగల రాగసుధ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో పదివేల మంది పేదలు అనేక సంవత్సరాల క్రితం నుంచి ప్రభుత్వ భూములను రక్షించి గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారికి ఇంటి పట్టాలు, ఇళ్లు, కనీస సౌకర్యాలు కల్పించకుండా గత ప్రభుత్వములే ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. వరంగల్ నగర పరిధిలోని జక్కలొద్దీ లెనిన్ నగర్, బెస్తం చెరువు, నానిమియా తోట, రాజీవ్ గృహకల్ప, మైసయ్య నగర్, పీఏ నగర్, ఓంకార్ నగర్, ఆర్ఎస్ నగర్, ఓఎస్ నగర్, సుందరయ్య నగర్, ఎంహెచ్ నగర్, నర్సంపేట పట్టణంలోని జ్యోతి బస్ నగర్, కారల్ మార్క్స్ కాలనీ తదితర కాలనీలను తక్షణమే అధికార యంత్రాంగం సందర్శించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలని డిమాండ్ చేశారు.

అనంతరం ప్రతినిధి బృందం కలెక్టర్ కార్యాలయ ప్రతినిధికి సమస్యలతో కూడిన మెమొరాండాన్ని ఇచ్చి, వారి హామీతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, నర్ర ప్రతాప్, మంద రవి, నాగెల్లి కొమురయ్య, యూపీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శులు కనకం సంధ్య, జిల్లా నాయకులు మాలోతు ప్రత్యూష, ఎగ్గని మల్లికార్జున్, మహమ్మద్ అక్బరుద్దీన్, మహమ్మద్ ఇస్మాయిల్, తాటికాయల రత్నం, గణిపాక ఓదేలు, నరసయ్య, నలివెల రవి, మాలి ప్రభాకర్, పరిమెల గోవర్ధన్ రాజు, బజ్జం కోటేశ్వరరావు, మైదం వేణు, వీరస్వామి, శేఖర్, కళా ఆశా బేగం, సుభాష్, మాధవి, పెద్ద లావణ్య, దాసారపు అనిల్, పూలమ్మ, సునీత, నరసయ్య, కైసర్ బేగం, జెట్టిరాజు, రేణుక, భరత్, మల్లయ్య, లావణ్య, సునీత, ప్రమీల, బిందు, విమల, ప్రమీల, పద్మ, అశోక్, జయమ్మ, రఘుపతి, రవీందర్, ఉసిల్ల శ్రీనివాస్, వినయ్, లక్ష్మణ్, యాదయ్య, యమున, వెంకన్న, స్వప్న, సల్మా, విజయ తదితరులతో పాటు వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

# 30 నుంచి ఎంఏ తెలుగు ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు:** వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025–2026 విద్యా సంవత్సరానికి ఎం.ఏ. తెలుగు రెగ్యులర్ కోర్సులో ప్రవేశాల కోసం ఈ నెల 30, 31 తేదీలలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఏ. తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు 2025 జూలై 7తో ముగిసింది. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న వెల్లడించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికేట్‌లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 99891 39136, 99894 17299 నంబర్లలో సంప్రదించవచ్చు.



# కోపాన్ని వదిలేయమన్న రజనీ

**మోహన్ బాబు**

రజనీకాంత్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని నటుడు మోహన్‌బాబు చెప్పారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రజనీకాంత్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా తమ మధ్య అనుబంధం ఉందని తెలిపారు. రజనీకాంత్ గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి. మా ఇద్దరి మధ్య 50 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. నేను అతడిని 'ఏయ్ బ్లడీ తలైవా' అని ముద్దుగా పిలుస్తాను. మా మధ్య అంత చనువు ఉంది. 50 ఏళ్ల క్రితం మా వద్ద ఏమీ లేనప్పుడు నటులుగా పరిచయం కాకముందు మద్రాసు ప్లాట్‌ఫామ్‌పై మొదటిసారి కలుసుకున్నాం. అప్పటినుంచి మా బంధం కొనసాగుతోంది. రోజులో కనీసం 3, 4 సార్లైనా మెసేజ్ చేసుకుంటాం. ఇటీవల కలిసినప్పుడు అతడు ఒకమాట చెప్పాడు. 'నాకు గతంలో ఎంత కోపం ఉండేదో నీకు తెలుసు. నేను తర్వాత కాలంలో దాన్ని వదిలేశాను. నువ్వెందుకు వదల్లేకపోతున్నావు. పుస్తకాలు చదవడం కాదు.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని కోపాన్ని వదిలెయ్' అని సలహా ఇచ్చాడు' అని మోహన్‌బాబు గుర్తుచేసుకున్నారు. రజనీ హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ మోహన్‌బాబుని కలుస్తుంటారు. ఈవిషయాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా ఇద్దరూ వెల్లడిస్తూనే ఉంటారు.

# పెద్ది మూవీ కోసం విలేజ్ సెట్

'ఉప్పెన'తో సెన్సేషనల్ డెబ్యూ ఇచ్చిన బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో రామ్‌చరణ్‌తో పెద్ది మూవీ తెరకెక్కుతోంది. కథకు ప్రధానమైన సన్నివేశాలు విజయనగరం నేపథ్యంలో చిత్రీకరించాల్సి ఉంది. అయితే అక్కడి వాతావరణం షూటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో, ఆ సీన్లను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్ వేసి తీయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ సెట్ కోసం ఏకంగా రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు– సమాచారం. ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామా కాగా, ఇందులో రామ్ చరణ్ ఒక క్రికెటర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన చిన్న గ్లింప్స్‌కి అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. కథ, లుక్ విభిన్నంగా ఉండనుందని తెలుస్తుంది. వచ్చే ఏడాదిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. చిత్రానికి ఆస్కార్ విన్నింగ్ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ట్యూన్స్ రెడీ అయ్యాయని సమాచారం. మాస్ నేపథ్యంలో సాగే కథకు రెహమాన్ ఇచ్చే మ్యూజిక్ ఎంతగా ఎలివేట్ చేస్తుందో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ– జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దేవరతో టాలీవుడ్ ఎంట్రీ– ఇచ్చిన ఆమె, వెంటనే రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేసింది. ఇక 'పెద్ది' కోసం రామ్ చరణ్ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాడు.. ఇటీ–వల ఆయన జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




# ఉస్తాద్ భగత్ సింగ్‌లో మరో హీరోయిన్

**శ్రీలీలకు తోడుగా రాశీఖన్నా చేరిక**

పవన్ కల్యాణ్ ,హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా అప్‌డేట్స్ కోసం పవన్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి ఈ టీమ్ ఓ అప్‌డేట్‌ను అందించింది. ఇందులో శ్రీలీలతో పాటు మరో కథానాయిక కూడా ఉన్నట్లు– తెలుపుతూ పోస్టర్‌ను పంచుకుంది. ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటి రాశీఖన్నా భాగమైనట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ విషయాన్నే దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'శ్లోక' పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడిరచారు. తన పాత్రతో సినిమాకు మరింత అందాన్ని తెస్తుందన్నారు. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు– చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీలీల భాగమవగా ఇప్పుడు రాశీ కూడా ఇందులో నటిస్తుండడం మరింత ఆసక్తిగా మారింది. గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇకపోతే పవన్ నటించిన 'హరి హర వీరమల్లు' జులై 24న విడుదల కానుంది. ఈసందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ లుక్‌కు అందరూ ఫిదా అయ్యారు. దీనిపై ఓ అభిమాని పోస్ట్ పెట్టగా.. దానికి హరీశ్ శంకర్ సరదాగా రిప్లై ఇచ్చారు. పవన్ ఉస్తాద్ లుక్ అదిరిపోయింది. ఓ అభిమానిగా హరీశ్ శంకర్ ఆయన్ని అద్భుతంగా చూపించనున్నారని అర్థమవుతోందని పోస్ట్ పెట్టారు. దీనికి దర్శకుడు రిప్లై ఇస్తూ.. 'తరతరాలుగా.. నరనరాల్లో ఆయనపై అభిమానం ఉప్పొంగుతోంది' అని అన్నారు.






# హీరోలు ఆ ఇద్దరే

**మనసు విప్పిన దర్శకుడు క్రిష్**

ఇద్దరు లెజెండ్స్ వల్లే 'హరి హర వీరమల్లు' సాధ్యమైందని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నార . ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రానికి మొదట క్రిష్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన స్థానంలో జ్యోతికృష్ణ దీన్ని పూర్తి చేశారు. తాజాగా దీనిపై క్రిష్ మౌనం వీడారు. మరో రెండు రోజుల్లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఇప్పుడు ఈ వీరమల్లు ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. నిశ్శబ్దంగా కాకుండా ఓ గొప్ప ఆశయంతో చరిత్రను ప్రజల ముందుకు తీసుకురానున్నాడు. ఈ చిత్రం ఇద్దరి లెజెండ్స్ వల్లే సాధ్యమైంది. వారు సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ ఎందరికో స్ఫూర్తి. వారిలో ఒకరు పవన్ కళ్యాణ్..మరొకరు నిర్మాత ఎఎం రత్నం అని అన్నారు ఆయన నిత్యం రగిలే అగ్నికణం. ఎందరికో ఆదర్శం. 'హరి హర వీరమల్లు'కు ప్రాణం పోసింది ఆయనే. ఆయన ఈ చిత్రానికి వెన్నెముక వంటి వారు. ఇక మరో వ్యక్తి నిర్మాత ఏఎం రత్నం.. నాకెంతో ఉత్సాహాన్నిచ్చిన ప్రాజెక్ట్‌లలో ఈ సినిమా ఒకటి. ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చింది. దర్శకుడిగా మాత్రమే కాకుండా.. ఈ సినిమా కథను రూపొందించడంలోనూ ఎన్నో విషయాలు తెలుసుకున్నాను అని క్రిష్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## హరిహరవీరమల్లు బుకింగ్స్ ఓపెన్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు శుభవార్త.ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఏపీలో టికెట్ బుకింగ్స్ మొదలవ్వగా.. తాజాగా తెలంగాణలో కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం డిస్ట్రిక్ట్ యాప్ ద్వారా టికెట్లు అందుబాటులో ఉన్నాయి. బుక్‌మైషోలో కూడా బుకింగ్స్ ఓపెన్ అవుతాయని చిత్రయూనిట్ తెలిపింది.

# గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

- విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి
- అన్ని రంగాల్లో ములుగు జిల్లా ముందడుగు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** నిరుద్యోగ యువతీ, యువకులు జ్ఞానాన్ని పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలు పొందేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహద పడతాయని, గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని రాష్ట్ర పంచాయతిరాజ్శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్ మహేందర్ జీలతో కలిసి జిల్లా కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనం, లైబ్రరీ బిల్డింగ్ లోపల రూ.16.50 లక్షలతో గ్రౌండ్ లెవెలింగ్, కొత్తగా నిర్మించిన టాయిలెట్ బ్లాక్, కాంపౌండ్ వాల్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి కూడు, గూడు, గుడ్డ ఎంత ముఖ్యమో జ్ఞానం పెంపొందించుకోవడం అంతే ముఖ్యమని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి చేరుకొని పుస్తక పఠన చేసుకునే అలవాటు అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు విద్యాలయాలు, లైబ్రరీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆరుబయట పుస్తక పఠనం చేయడానికి రూ.10 లక్షలతో పలు రకాల చెట్లను పెంచడంతోపాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలోని రోడ్లను విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కోటి రూపాయలతో కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులను త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠన చేసి ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరు ఏదైనా ఒక రూపంలో సహకరించి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చెయ్యాలన్నారు. పోటీ పరీక్షల సమయంలో మధ్యాహ్న భోజనం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవడానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కొనసాగుతున్నదని, ఇప్పటికే ఒక ఐటీ రంగం ములుగులో ఏర్పాటు కాగా మరో రెండు ఐటీ రంగాలను ఏర్పాటు చేయడానికి నాలుగు కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని అన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలు పర్యాటకులు తెలిసే విధంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ వద్ద జంక్షన్ ఏర్పాటు చేసి పొందుపరుస్తామని, ములుగును ప్రేమిస్తున్నా అనే నినాదాన్ని వెలుగులోకి తేవడం జరుగుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో నూతన హంగులతో ఏర్పాటు చేయనున్న నూతన బస్టాండ్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకు ములుగు శాఖ నూతన ప్రాంగణ ప్రవేశాన్ని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.అలివేలు, మున్సిపల్ కమిషనర్ సంపత్, డీసీఓ సర్దార్ సింగ్, డీసీసీ బ్యాంక్ మేనేజర్ ఇంజపెల్లి తిరుపతి, తహసిల్దార్ విజయ భాస్కర్, డీసీసీ బ్యాంక్ పాలక వర్గ సభ్యులు మాడుగుల రమేష్, పోలేపాక శ్రీనివాస్, కక్కిరాల హరిప్రసాద్, దొంగల రమేష్, కొండ నరేందర్, లోకల్ పాక్స్ చైర్మన్స్ బొక్క సత్తి రెడ్డి, కాసర్ల కుమార స్వామి, పన్నాల ఎల్లారెడ్డి, డీసీసీ బ్యాంక్ ఆఫీసర్స్, బ్యాంక్ సీఈఓ ఎండి.వజీర్ సుల్తాన్, డీజీఎం జంపాల అశోక్, ఏజీఎం, నోడల్ ఆఫీసర్ గంప స్రవంతి, బ్రాంచ్ సిబ్బంది అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎస్ నిఖిల్, గ్రంథ పాలకులు బి.సమ్మక్క, ప్రజా ప్రతినిధులు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పల్లెల్లో స్థానిక సందడి

- రసవత్తరం కానున్న ఎన్నికలు
- ఆశావహుల పర్యటనలు, పలకరింపులు షురూ
- షెడ్యూల్ వచ్చేలోపు ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు మొదలు పెట్టడంతో పల్లెల్లో సందడి నెలకొంది. దామెర మండలంలో వివిధ పార్టీల మద్దతుతో బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు జనం ఆదరణ కోసం అప్పుడే గ్రామాల్లో యాత్రలకు శ్రీకారం చుట్టారు. షెడ్యూల్ వచ్చే లోపు ఒకసారి ప్రజావిశ్వాసం సమకూర్చుకోవాలని భావిస్తున్నారు.

### నిత్యం జనంతో..

జనం నాడీ పట్టేందుకు ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పండగలు, శుభకార్యాలలో పాల్గొంటూ.. నిత్యం జనం మధ్య కనిపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఏ వేడుకల్లోనైనా ముందు వరుసలో ఉంటున్నారు. ప్రజలకు ఏర్పాట్లు కల్పించడంలో చొరవ తీసుకుంటున్నారు. ఎవరైనా ప్రమాదాలకు గురైనా, అనారోగ్యం బారిన పడినా ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తున్నారు. ప్రజల నోట్లో నాలుకలా మెదిలేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలు ఈసారి యువతకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉండడంతో కొత్త తరం నేతలు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

### మండలాధ్యక్షుల చొరువ..

అన్ని పార్టీల మండలాధ్యక్షులు చురుకుగా కదులుతూ గ్రామాల వారీగా ముఖ్య నాయకులకోసం గాలం వేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల గుర్తించి ఆరా తీస్తున్నారు. అన్ని అనుకూలిస్తే మరో పది రోజుల్లో స్థానిక ఎన్నికల షెడ్యూలు విడుదల అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ లోపు తాము ప్రజల్లో ఉన్నామని చెప్పేందుకు ఆశావహులు కొందరు తహతహలాడుతున్నారు. ప్రజల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



# పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వర్యంలో మామూనూర్ పీటీసీ వేదికగా త్వరలో జగరబోయే రెండో రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణపై డ్యూటీ మీట్ పరిశీలన బృందం సభ్యులు, కమిషనరేట్ కు చెందిన పోలీస్ అధికారులతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం మామూనూర్ పీటీసీలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, సీఐడీ ఎస్పి రాంరెడ్డి, కమాండెంట్ రామకృష్ణ, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావుతో పాటు, వరంగల్ పోలీస్ కమిషనరేట్, సీఐడీ, రాష్ట్ర సెక్యూరిటీ విభాగానికి చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో మంగళవారం వివిధ సమస్యలపై వచ్చిన స్థానికులనుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏ సమస్యలున్నా ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారుల నుంచి సరైన స్పందన లేని పక్షంలో తనకు తెలియజేయాలని సూచించారు. పదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వని అసమర్థులు నేడు ప్రజా ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులను ఇస్తుంటే జీర్ణించుకోలేక విమర్శిస్తున్నారని మంత్రి సురేఖ ఆరోపించారు.



### రాజన్ బాబు కుటుంబానికి పరామర్శ..

తూర్పు నియోజకవర్గం 40 వ డివిజన్ ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన కన్నతల్లి ఫౌండేషన్, కన్నతల్లి వృద్ధాశ్రమం చైర్మన్ కొండ మీది రాజన్ బాబు తల్లి కొండమీది అనంతమ్మ మరణించిన వార్త తెలుసుకొని మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారి గృహానికి చేరుకొని కొండమీది అనంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామంటూ మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, కార్పొరేటర్లు పోశాల పద్మ-స్వామి, మాజీ కార్పొరేటర్లు బత్తిని వసుంధర, బత్తిని అఖిల్, కేడల పద్మ-జనార్ధన్, నాగపూరి వెంకటేశ్వర్లు, సిద్ధం రాము, కాంగ్రెస్ నాయకులు కేడల జనార్ధన్, మంతెన సునీత, నగర మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న, నాగపురి సంజయ్ బాబు, దాసి రాందేవ్, కోడూరు బిక్షపతి, నాగపురి బొందయ్య, పోశాల మల్లేశం, దాసరి సుధాకర్, జడల శ్రీనివాస్, ఎలగొండ రవి, పసునూరి రమేష్, బైరగొని మనోహర్, ఓంకార్, బత్తిని నవీన్, చందు, తాళ్ల పెల్లి సంధ్య, కొండమీది రమేష్ బాబు, రాముల సదానందం తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com